


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

"**నా నుంచీ సానుభూతిని ఆశించి** అది దొరకని ఆశాభంగంతో మాట్లాడుతున్నావని అర్థం చేసుకోగలను. ఒక వ్యక్తి సానుభూతిమీద మరొక వ్యక్తికి జన్మ హక్కున్నట్టుంది. సానుభూతి కలగడం, కలగకపోవడం, లేక ఒక వేళ కలిగినా దాన్ని వ్యక్తం చేయకుండా మనసులో ఉంచుకోడం అనే స్వేచ్ఛ ప్రతి వ్యక్తికీ ఉంటుంది."

"చావబోతున్నవాడికి; అందునా నాలా చావబోతున్న వాడికి ఎవరి సానుభూతైనా పులుసులో ఒక వాడేసిన కరివేపాకుతో సమం. చావును శిక్ష రూపంలోనో, ప్రతీకార రూపంలోనో మరొకడికి విధించినప్పుడు, ఉపయోగపడకపోయినా ఓదార్పును ఆశిస్తాడేమో. తనకై తాను ఆ లక్ష్యాన్ని ఎంపిక చేసుకున్నప్పుడు అలా ఆశించడం ఉండదేమో అనుకుంటున్నా. కానీ ప్రతి మనిషీ సాటి మనిషి పట్ల అవలంభించ వలసిన మర్యాదలుంటాయి కనుక మరో మనిషి అలాంటి మర్యాదను అతిక్రమించినప్పుడు ఎత్తి చూపే ప్రయత్నం చేయ వచ్చు."

"మరెందుకు నీ చావు విషయం నా ముందు ప్రకటించడం, ఆ పనేదో తర్వాత నాకు చెప్పకుండా చేసేసుకోవచ్చుగా? బలహీన మనస్కుడయ్యుంటే బాధించి ఆనందించడానికా?"

"కేవలం ఒక వ్యక్తికి చెప్పి వాడిని బాధించడం వలన పొందే సంతోషం – నిజంగా అలా పొందాలని చూస్తే – అతి స్వల్పం కదా? ఎక్కువ మందిని బాధించగలిగితే ఎక్కువ ఆనందం దొరుకుంటుంది!"

"ఐతే నీ అసలు కారణం సెలవివ్వు."

"ఏ విషయాన్నైనా మరొక వ్యక్తితో పంచుకోవాలన్న సాధారణ కోర్కె లేక బలహీనత; ఆ వ్యక్తిలో ఆ విషయం ఆసక్తిని కలిగించగలిగితే కలిగే సంతృప్తి."

"సరే. నేను నా కుతూహలాన్ని వ్యక్తం చేయకపోవడం కించిత్ ఆశ్చర్యం, అసంతృప్తి నీలో కలిగి ఉండటం సహజమే అని ఒపుకుంటున్నా. వయసు మీరని నీవు; ఒకవేళ మానసిక పెద్ద రోగం కానీ శారీరక రోగం ఉండుంటే (ఏదీ పైకి కనబడని) నీవు చావడమేమిటి? ఇలాంటి ప్రశ్నలు నీకు కావాలనుకుంటా. క్లుప్తంగా చెప్పు. నా కాలాన్ని నీకై ఊరికే వెచ్చించాలని నాకు లేదు."

"దేముడిని దేవుడు చంపబోతున్నాడు."

అనంతం అతని ముఖ కవళికలు పరిశీలించే ప్రయత్నం చేశాడు. అతని ముఖం భార రహితంగాను ప్రశాంతంగాను కనిపించింది. బుద్ధుడు తన మరణం ఆసన్నమైందని ఆనందుడితో చెపుతున్నప్పటిలా. అనంతం తన ముఖాన్ని పరిశీలిస్తున్నాడని గ్రహించి ముఖాన్ని అలా మార్చుకున్నట్టున్నాడు. అవతలివాడి నుంచి ఏదైనా విషయాన్ని దాచడంలోనూ ఎదో సంతృప్తి ఉంటుందేమో; తన మనసులోకి మరొకడు తొంగి చూసే ప్రయత్నం నచ్చకపోయి ఉండవచ్చు.

"హత్యా?"

"నాకే తెలియదు. చావు మాత్రం ఖాయం."

"చావు తప్పనపుడు, హత్యగావించబడటం, ఆత్మహత్యకు పాల్పడటం త్వరగా జరిగితే మంచిది కదా. హత్యకు గురి కాబడున్నపుడు దానికై ఎదురుచూడటం మరో హింస, వడ్డీలా."

"వడ్డీ హింసకు నేను గురి కాబడటం లేదు; సిగిరెట్ ఆఖరి దమ్మును నోట్లోకి తీసుకుని ఒదిలిపెట్టబోతున్నప్పటిలా జీవితపు ఆఖరి దమ్ము ఇది."

"ఒక వేళ సాధారణ చావుకై ఎదురు చూడటమంటే ఎంతకాలం జీవితాన్ని పొడిగించబడితే అంతకాలం బాధను పొడిగించడమే అవుతుంది."

"బాధకు పరిష్కారం ఏ విధమయినదే అయినా చావే అని మీరూ అంగీకరిస్తున్నట్టున్నారు; నాకు అది ప్రోత్సాహకరం కూడాను. బాధను భరించలేకపోవడం అనే అంశం నా చావులో లేదని గ్రహించగలరు."

"కారణాలు వినడానికి ఇష్టంగా ఉన్నాను."

"దానిని మీరు నాకు చేస్తున్న సహాయంగా భావించక్కర్లేదనుకుంటా. కారణాలు చెప్పి మీ కుతూహలాన్ని సంతృప్తి పరచడమనే దాన్ని మీకు నేను చేస్తున్న ఉపకారంగా నేను భావించడంలేదు."

"మానవ కనీస ధర్మంగా భావించు."

"నివారించే ప్రయత్నం చేయరా?"

"నివారించడం అసాధ్యం అనుకుంటా. నివారించగలిగినా దాన్ని నీకు నేను చేసిన సాయం క్రింద నేను భావించ దలచలేదు. ఎవరికీ ఎలాంటి సహాయం చేయరాదని నిన్ననే తీర్మానించుకున్నాను. నాది పునర్జన్మ. నా విషయాలు నీతో పంచుకోవలసిన అవసరం నాకు లేదు.

నీ గురించే కాదు; ఎవరి గురించీ నాకు ఆసక్తి లేదు. నీ గురించి మాత్రం అది నాలో ఉండాలేం?"

"నిజానికి అక్కర లేదు. పోతూ పోతూ ఎవరికైనా ఏ బాధనైనా ఎందుకు కలిగించాలి. పోనీ ఇతర విషయాలు మాట్లాడొచ్చా?"

"నీవు చెప్పబోయే విషయాల మీద ఆధారపడుంటుంది, అభ్యంతరకరమా లేదా అన్నది. ఖాళీ చెక్కులు ఎవరికీ భవిష్యత్తులో ఇవ్వను; ప్రస్తుతం నాకు బాంకులో ఖాతాయే లేదు."

"మీది షరతుతో కూడిన సంసిద్ధత," అంటూ కిచకిచా నవ్వాడు.

"ఎప్పుడు నాకు నచ్చకపోతే అప్పుడు నీవు చెప్పేది ఆపమంటాను. ఆపకపోతే నేనే నా తువ్వాలు విదిలించుకుని ఇంచక్కా లేచిపోతాను."

"లోకాతీత వ్యక్తి మీరు."

"నీవు కాదా?"

"సరే, ఇద్దరం లోకాతీత వ్యక్తులం కాదనుకుందాం. ఇది రాజీ ధోరణి కాదు. లోకం గురించి క్షుణ్ణంగా తెలిసినపుడు కదా మనం లోకాతీత వ్యక్తులం అవునో కాదో నిర్ణయించడానికి సాధ్యపడేది?"

"నిజం ఎల్ల వేళల చేదుగానే ఉండాలని లేదు అనిపిస్తోంది; నీవు  అన్నఈ మాటలు వింటుంటే."

"అన్నయ్యా అని మిమ్మల్ని పిలవ వచ్చా?"

"బావా అని పిలిచినా అంతగా ఇబ్బంది పడను; నాకు తోబుట్టువులు లేరు కనుక."

“ఉండుంటే, అలా పిలిస్తే ఊరుకోరనుకుంటాను."

"ఆపుడు ఆలోచించి నా అభ్యంతరమో ఆమోదమో తెలియజేస్తాను. ఇంతకూ, నీ పేరేమిటో తెలుసుకోవచ్చా? అసలు పేరంటూ ఉందా?"

"దిక్కుమాలిన వాడికి కూడా పేరుండకపోదని మీకు తెలుసు. నా పేరు ఎందుకు తెలుసుకో కూడదూ? అది బ్రహ్మ రహస్యం కాదు. నా పేరు చెప్పక పోను ఎప్పుడో ఒకప్పుడు. నా పేరుతొ మీకు ఏమి పని? మీ పేరేమిటో నాకక్కరలేదు. నా గురించి పేరు ఏమీ వెల్లడి చేయ లేదు. అడగాలి కానీ నా గురించీ ఏదైనా చెబుతా."

"నీతోనే నాకు ఏ పనీ లేనపుడు, నీ పేరుతో మాత్రం నాకు ఏపని? దాచుకో. పిలవడానికి వీలుగా ఉంటుందని అడిగా. అలా అడిగే హక్కు నాకుందనుకుంటా, తెలుసుకునే హక్కు నాకు లేకపోయినా."

"నా జీవితపు ప్రతి అంశాన్నీ చెప్పుకోవాలని ఉంది నాకు, కానీ మీకు దాన్నంతా వినడం కష్టం."

అనంతం ఆవులించాడు.

ఆగంతకుడు నవ్వాడు.

"నా పేరును తెలుసుకోవాలని మీరు భావించడం నాకు మీరిచ్చే గౌరవంగా భావిస్తున్న సవినయంగా."

"తల్లి తండ్రులు పెట్టారా?"

"లేదు. నేనూ దాని పెట్టుకోలేదు. ఏ శ్రేయోభిలాషి పెట్టాడో కూడా నాకు తెలియదు. ఒక్కోసారి అనిపిస్తుంటుంది – జీవితంలో అతి స్వల్పమైన విషయం కూడా తెలియని నేను సృష్టి రహస్యాల మీద ఆసక్తి చూపడం ఏమిటా అని."

"మనల్ని మనం అధికంగా ప్రశ్నించుకుంటే జీవించడానికి అది ప్రతిబంధకం అవుతుందని నేను కొత్తగా తెలుసుకున్న విషయం."

"మీరిచ్చిన సదావకాశాన్ని అధికంగా ఉపయోగించుకుంటున్నానని అనిపిస్తున్నది. అధిక ప్రసంగాలు చేస్తూ, కాలహరణానికి పాల్పడుతూ. దేవుడు నా చివరి క్షణాలలో నన్ను కనికరించి మీ సాంగత్యాన్ని ప్రసాదించినట్టున్నాడు. కృతజ్ఞుడిని."

"కృతజ్ఞత ఒక బాకీని తెలియ జేస్తుంది. బరువు కూడా."

"అవును – ఆ రెండు బాకీలూ ఎగ్గొట్టే వాళ్లకు వర్తించవు."

"జీవితం ఎన్నో అంశాల సముదాయం. అది – అద్భుతం, భయానకం, జుగుప్సాకారం, ప్రేమార్ద్రం, ద్వేషార్ద్రం, జీవించదగినది, మరణించదగినది. అది  ఎలా చచ్చినా ఎలాగో ఒకలా జీవించ దలచుకున్నా. నిన్ను మాత్రం నేను నీ మరణ నిర్ణయం నుంచి నివారించదలచుకో లేదు. నివారించడానికి నేనెవరిని? నీవు తాగలేదు కదా?"

"ఒకే రకం అనుభవం; ఒకే రకమైన మనసూ శరీరం ఉన్నపుడు – ఆలోచనా స్రవంతీ ఒకేలా ఉండే అవకాశం ఉండొచ్చు. అప్పుడు ఆ వ్యక్తులు ఒకే లాంటి నిర్ణయానికి రావడానికి  అవకాశం ఉంటుంది. మనం అన్ని విధాలా ఉత్తర, దక్షిణ ధ్రువాలం. అందుచేత మీరు జీవించాలని భావించినా, నేను మరణించాలని భావించినా పెద్దగా ఆశ్చర్యపడక్కర లేదు. తాగుడు విషయానికి వస్తే, నాకు ఆ మాత్రం స్తోమత కూడా లేదు; దాని మీద మనసూ లేదు; జీవితపు కాఠిన్యం నుంచీ కాసేపటి ఊరటన్నా మైకం  ఇవ్వగలదన్న నమ్మకమూ లేదు. వాసన కొడుతున్నానా?"

"తాగుడు వాసన లేదులే."

కొంచం దూరం జరిగాడు ఆగంతకుడు.

"చూడబ్బాయ్, నీతో ఓ గంట గడిపితే నేనూ నీతో బాటూ  ఇక్కడే కొండ మీది నుంచి దూకేస్తానేమో అన్న భయం కలుగుతోంది."

"చావంటే భయపడాలంటారా?"

"బతక దలచుకున్నవాడు భయపడాలి. అంతే కాక చావడానికి ధైర్యం కావాలి. నేను దోపిడీదారుగానైనా జీవించదలచుకున్నాను. నేను నీలా ధైర్యవంతుడిని కాదు. అందుచేత నాకు భయం ఉంది. నన్ను చావుకు పురిగొల్పి నీవు కొండ దిగి జీవించడం కొనసాగించినా ఆశ్చర్యపడను."

"నిజమే, సాటి మనిషిని నమ్మరాదు. నమ్మే గుణమే మనకు మంచి చెయ్యదు. పోతే, అన్నయ్య, నీ చావు వలన నాకు ఉండే లబ్ది ఏమిటి? అది లేకుండా నేను ఎందుకు చావుకు పురిగొల్పాలి. పైగా, చచ్చేవాడికి తోడెందుకు? మరో విషయం: నీవు చస్తానంటే నేను అడ్డుపడతాను. నా రోగానికి నేను వాడ దలచుకున్న మందును నీవు సేవిస్తానంటే నేను ఊరుకోను. నాలో దుర్మార్గం లేదన్నయ్యా. నాకు సంబంధించినంత వరకు చావును అంటరానిదిగా చూడటంలేదు. అద్భుతమైన అనుభవంగా భావిస్తున్నా. పోనీ నేను చెప్పేది మిమ్మల్ని చావుకు పురిగొల్పుతుందేమో అని భావిస్తే, మౌనం దాల్చనా? నా చావును నివారిస్తారా, దానికి సహకరిస్తారా?"

"తన ప్రాణాన్ని తాను ఆర్పేసుకోవడం అద్భుతమైన అనుభవంగా భావిస్తున్నపుడు, నేను సైన్ధవుడిని ఎందుకవ్వాలి? ఈ విషయంలో ఒక సామెత గుర్తుకొస్తోంది. తెగించిన వాడికి తెడ్డే లింగం."

"నా రక్తాన్ని నేను చిందించుకోబోతున్నా, నా జీవితంపై నేను తిరుగుబాటు చేసుకోబోతున్నా. చావు ద్వారా తప్ప మరోలా తిరుగుబాటు చేసుకోవచ్చా? అది తెలియక చావును ఎంచుకున్నా. జీవితంలో ఏ నిర్ణయాన్నైనా తప్పు పట్ట వచ్చులే. దేముడున్నాడని నా తిరుగుబాటు విషయంలోనైనా: ఇన్నేళ్లు జీవించాల అని ఆయన నిర్దేశించి ఉంటె దాన్ని నా ఆత్మహత్య ద్వారా తిరుగుబాటు జెండాను పాతి 'నీవు నిర్దేశించింది తప్పు' అన దలచాను అని నేను ప్రకటిస్తే, నీ ఆయుర్ధాయం ముగిసింది కావున దేముడే నీ చేత నీ ప్రాణాన్ని తీయిస్తున్నాడని అనవచ్చు; దేముడున్నాడో లేదోనీకు తెలియకుండా దేముడిమీద ఏమి తిరుగుబాటయ్యా అనీ అనవచ్చు. నా ఆత్మహత్య సహేతుకంగా ఉండాలి కనుక – అలా ఉన్నట్టు కనీసం నాకు అనిపించాలి గనుక – ఇది నా మీద నా తిరుగుబాటు అని నేను అంటాను."

"అలాంటి ఆలోచనలు చేసే వ్యక్తిని మానసిక వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించాలి. కానీ నేను ఆ యాతన పడదలచుకోలేదు. నీవు చావకూడదని దేవుడు భావిస్తే దాన్ని నివారించడానికి దేవుడికి మరో మార్గం తోచకపోదు. దేవుడున్నాడా లేదా అన్న విషయాన్ని పక్కనుంచితే, ఆఖరి క్షణంలో నీకు కాళ్ళు ఒణికి నీ ప్రయత్నాన్ని విరమించవచ్చు. నీవు కొండమీది నుంచీ దూకినా కాళ్ళూ చేతులూ విరిగి ప్రాణంతో బయటపడవచ్చు. నీవు మింగే విషం కల్తీది కావచ్చు. ఆ బాధతో తీసుకుని మరొకసారి చచ్చే ప్రయత్నం చేయడంకన్నా ఈ బ్రతుకుని ఈడ్చడమే నయం అన్న నిర్ణయానికి నీవు రావచ్చు. జీవితంలోని అనిస్థితి జీవితానికి అవసరమేమో!"

"అలాంటి అనిస్థితి తొలగాలంటే నీ అవసరం నాకుంది. అది చెయ్యడం వలన నీవు కోల్పోయేదేమీ ఉండదు; కాస్త శ్రమ తప్ప, ఒక బొట్టు చమట తప్ప. నీ ఉక్కు పిడికిళ్లతో నా బలహీనమైన గొంతును నొక్కెయ్యి."

"ఆశ, దోశ, అప్పడం, వడ! అప్పుడది ఆత్మహత్య అవదు, నేను చేసిన హత్య అవుతుంది. వందేళ్లు ఏదోలా జీవించాలనుకుంటున్ననేను నీకు సహాయం చేయబోయి చిక్కులలో ఇరుక్కోవచ్చు, ఒక వేళ పాపపుణ్యాలుంటే పాపం చేసినవాడినవుతా. ఒక చుక్క చెమటనైనా ఇంకొకరి గురించీ ఖర్చుపెట్ట దలచలేదు. నేను జీవించడానికి కొన్ని కఠిన నియమాలవసరమనుకుంటున్నాను."

"నేను ఆత్మహత్య చేసుకుంటున్నపుడు చూస్తుంటావా?"

"నేను చూడటం నీకు అవసరమా?"

"అవసరం అని నేనంటే ఆ పని చేస్తావా?"

"అది ఏ విధంగా అవసరమో ముందు నాకు నచ్చ చెప్పు."

"ఎలా నచ్చ చెప్పాలో తెలియదు."

"ఆత్మ హత్య చేసుకుంతుంటే చూడడం ఆనంద దాయకమైన అనుభవమో కాదో నాకు తెలియదు. ఆనందాన్ని అది కలిగిస్తుంది అంటే చూస్తానేమో. నీకు అలాంటిది ఇష్టమైన అనుభవమా?"

"కాదు. నాలో దుర్మార్గం లేదు."

"ఎవరైనా ఆత్మహత్య చేసుకోబోతుంటే నీవు నివారిస్తావా?"

"తప్పక."

"ఎందుకనీ?"

"నాలో దుర్మార్గ గుణం లేకపోవడం వలన."

"నేను నివారించకపోతే నాలో దుర్మార్గ గుణం ఉన్నట్టేనా?"

"ఉన్నట్టే."

"అయితే నిన్ను నేను నివారిస్తాను. నేను దుర్మార్గుడిని కాదని నీకు నిరూపించాలి కాబట్టి."

"నీలో దుర్మార్గం ఉన్నా, అది లేదని చెప్పుకోడానికి నన్ను నివారిస్తావా? నాకు సంబంధించినంతవరకు నాకు మీరు అడ్డు రాకపోతే, నాకు మంచి వాడికిందే లెక్క. మానవుడికి ఉండవలసిన, ఉండకూడని గుణాలతో నాకు పని లేదు."

"నేను ఉంటుండగా ఆత్మహత్య చేసుకోవడం ఎందుకు? నేను వెళ్లి పోయినతర్వాత కానీ."

"నీవు వెళ్లి పోయినప్పుడు దానికి పూనుకుంటే నేను ఆత్మహత్య చేసుకోడం నీకు అభ్యంతరకరం కాదు. అంతేనా?"

"నిజం చెప్పాలంటే, అంతే. అబద్ధం చెప్పాలంటే కాదు," అన్నాడు అనంతం.

"మరొకరి బలవంతపు చావును చూసి పిరికిదనంవలన భయపడవచ్చు కరుణా స్వభావం వలన బాధపడవచ్చు. నిర్వికారంగా ప్రేక్షకపాత్ర వహించ వచ్చు – ఇందులో దుర్మార్గం ఉందొ, స్థితప్రజ్ఞత ఉందొ!"

"హంతకులు  కేవలం క్రూరత్వం వలననే హత్యను చేస్తారని అనుకోలేము. క్షణికావేశం; లేక ఎదో లబ్ధి లేక ప్రతీకార వాంఛా కారణాలు కావచ్చు. ఇంతకూ నీవు నిన్ను ఎందుకు చంపుకో దలచావో, అది అవసరమో కాదో అన్న అవగాహన ఉందా?"

"చెప్పానుకదా, అదొక తిరుగుబాటు చర్య."

"దాని వలన నీవు సాధించినది ఏమిటి?"

"ప్రతీకార చర్య కావచ్చు; కనీసం అది నా నిరసన – నా ఆత్మ సంతృప్తి గురించీ చేస్తున్నది; దేముడు ఉండనీ, లేకపోనీ. నిరసన వ్యక్తం చేయడం ఒక విధంగా ఎదో సాధించినట్టే. ఎక్కువగా ఆలోచిస్తే, ఏ ప్రణాళికా అమలుచేయడం అసాధ్యమవుతుంది. అయినా బుర్ర పేలుతుందా అన్నట్లు ఆలోచించాను."

"అసాధ్యమనిపిస్తే ఆ పనికి పూనుకుని ఉండవు; పూనుకున్నావు కనుక సాధ్యమే అన్న అంతిమ నిర్ణయానికి వచ్చి ఉంటావు, అవునా?"

"కనీసం నిరసన వ్యక్తం చేయలేకపోతే బ్రతకలేను."

"నీవనుకున్న మార్గంలో నిరసన చేసినా బ్రతకవు."

"ఏ విధంగానూ జీవించడం అసాధ్యం. మరో మార్గం ఉంటె చెప్పన్నయ్యా."

"నీకన్నా దుర్భరమైన జీవితాలు సాగించే ఎంతో మంది బ్రతకాడానికే కానీ చావడానికి ప్రయత్నం చేయడం లేదు."

"నాది తిరుగుబాటు; చావబోవడం జీవించడం అసాధ్యం అవడంచేత కాదు."

"నేను నీకు మార్గాలను వెదికి చూపించడానికి కాదు ఇక్కడ కూర్చున్నది. ఎవడి మార్గాలు వాళ్ళే వెదుక్కోవాలి. నచ్చిన దాన్ని ఎంపిక చేసుకోవాలి. నా మార్గాన్ని అలా ఎంపిక చేసుకున్నా, ఆ శక్తి నాకు వరంలా దక్కటం వలన."

"సరే నిరసన మాట పక్క నుంచుతా, ఏ కారణం లేకుండా మరణించ కూడదా?"

"నీవు కారణం లేకపోయినా చద్దామనుకుంటే దేవుడు కూడా అడ్డలేదు. నిన్ను చూస్తుంటే దాస్తోవిస్కీ  నవలలోని కిరిలోవ్ గుర్తుకొస్తున్నాడు. అలాంటి వ్యక్తులు సంఘానికి ప్రమాదకరమైన వాళ్ళు."

"చనిపోదామనుకునే వాళ్ళూ ప్రమాదకరమే! బ్రతికున్న వాళ్ళ వల్ల ఏ ప్రమాదం లేనట్టు. నా చావును ఎవరికీ ఏదోలా వాడుకోడానికి అంకితం చేయడం లేదు. నా బ్రతుకే కాదు, నా చావూనూ ఎవరికీ ఇబ్బందికరం కాదు. మనుషుల మీద నాకు ప్రేమ, ద్వేషం లేవు. ఎవరినీ కుట్టలేని పురుగును; ఎట్టి పరిస్థితిలోనూ కుట్టకూడదు అనుకునే పురుగును; ఎవరైనా నేలరాసి చంపెయ్యగలిగిన పురుగును. పురుగు మనిషికన్నా గొప్పదని భవంచడంలేదు."

"నీకు లోకమంటే, దేముడంటే ద్వేషం అంతరాంతరాల్లో ఉండొచ్చు;  ద్వేషం నీలో అంతర్లీనంగా ఉందని నీకు తెలిసి ఉండదు."

"అలా తప్పక ఉండి ఉండొచ్చని మీరు ఏ కారణం వలన అనుకుంటున్నారో నాకు తెలియదు."

"నాకూ తెలియదు."

"నా అంచనా ప్రకారం మరో అరవై ఏళ్ళు బతుకుతావు కానీ ముందే పోదలచుకున్నావు."

"పుట్టిన నాటి నుంచీ చావుకు దగ్గిర అవుతూనే ఉంటాము కదా, క్రమేపీ కరిగే మైనపు బొమ్మలా. ఏ క్షణాన్నైనా మరణం ఎదో ఒక విధంగా సంభవించ వచ్చు; అలా అని మనలను మనం ఎప్పుడు కావలిస్తే అప్పుడు చంపేసుకోము. ఎంతో కాలం బ్రతుకుతామన్న ధీమాతో ఉంటాము. ఈ ఇరవై సంవత్సరాలలో ఏనాడూ చావాలని అనిపించలేదు. ఇప్పుడు ఇక చాలు అనిపిస్తోంది. అలా అనిపించడానికి చావును తిరుగుబాటుగా భావించడానికి నాకు స్పష్టంగా తెలియని కారణాలు ఉంటాయి. ఆకలిలా, దప్పికలా చావు ఒక అవసరం. అందుచేత దాన్ని తీర్చాలి అన్న భావన  ఉండుండొచ్చు. నాకున్న ఒక వెసులుబాటు ఏమిటంటే నేను ఎవరి గురించీ బతకక్కర లేదు. నా గురించీ నేను బతకాలి అనీ లేదు. రోగాలు కాని వాటిని రోగాలుగా, రోగాలను సహజ లక్షణాలుగా భావిస్తుంటాము. రోగగ్రస్తం కాని మనసు ఉండదు."

" నీతో స్నేహం లేక పరిచయం ఆత్మహత్యా సదృశం."

"ఆత్మ హత్యా ఒక అంటురోగమేనటగా? వెర్తెర్ అన్న పాత్రను గెటే సృష్టించిన తరువాత ఆ యువకుడిలా అలంకరించుకుని ఆ కాలపు కొందరు యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారు."

"కొందరు యువకులే కదా అలా చేసింది. చేయని వాళ్ళ జాబితాలో నీలాంటి వాళ్ళు మిగిలిపోయారు.  నిన్ను నేను కట్టి పడేయడం లేదు. ఈ క్షణాన నీవు కొండ మెట్లు దిగి వెళ్లిపోవచ్చు; నాతో గడిపిన గడియలు పీడ కలల్లోకి జమ వేసెయ్యవచ్చు."

"మాదక ద్రవ్యం రుచి చూసిన వెంటనే దాన్ని పక్కకు తోసేసి లేచిపోలేము. కొందరి సాహచర్యం క్షణకాలానిదే అయినా తోసిపుచ్చేయడం కనురెప్ప వేయడమంత తేలిక కాదు."

"పోయేటప్పుడు మరొక అపరాధ భావంతో పోవాలేమో నేను."

"పోయే వాడు అపరాధభావాన్ని ఎందుకు ఖాతరు చెయ్యాలి?"

"మనసు అలా బాధించి తేలికగా దాన్ని కొట్టిపారేయలేదు. ఈ అపరాధ భావమూ మనో తటాకంలో విసిరిన రాయి. చలనం లేని తటాకం లాంటి మనసుతో పోవాలనుంది. పోయేటప్పుడు ఎదో ఒక కోర్కె, ఇదీ అని తెలియని అసంతృప్తి నీడలా వదలవు."

తాను కాక మరొకరెవరైనా ఆ ఆగంతకుడి పక్కన అంతసేపు కూర్చుని అతను చెప్పేదాన్ని, అతని మధురమైన స్వరాన్ని వింటే మానసిక ఆరోగ్యం పాడవక తప్పదేమో అనిపించింది అనంతానికి. నవ్వాడు.

"ఎంత అందమైన నవ్వు మీది; మీరు నవ్వుతో లోకాన్ని జయించగలరు లేక చెరచగలరు."

"జయించ గలను అని నీవన్నందుకు సంతోషమే గాని. అలా జరుగలేదు పాతికేళ్ల జీవితం గడిచిపోయినా."

అతను తనను పొగిడాడు కాబట్టి అతన్ని పొగడకపోయినా అతనిలోతనకు నచ్చిన ఒక లక్షణానికి సంబంధించిన నిజం చెప్పాలనిపించింది.

"నీ స్వరం అతి మధురం. ఆ మాధుర్యం  నిన్ను ఒదిలిపోకుండా నన్ను ఆపుతోంది, నీవు చెప్పేవి పనికిమాలిన విషయాలే ఐనా."

"ఒక పొగడ్త, ఒక తెగడ్త––ముడ్డి గిల్లి జోకొట్టినట్టు."

"నీ మొదటి  రెండు పదాలు క్రమం తప్పాయి," నవ్వు  వచ్చినా నవ్వకుండా అన్నాడు అనంతం.

"నా స్వరం వింటుంటే వెళ్లిపోవాలని మీకు అనిపించనట్టు, మీ అందం చూస్తుంటే నా చావును ఒక అరగంటో, గంటో వాయిదా వేసుకోవాలనిపిస్తోంది."

"నీవు స్వలింగ సంపర్కుడివా?"

"భయపడకండి; నాకు ఏవిధమైన లైంగిక సుఖం ఇష్టం లేదు; అలా అని నపుంసకుడిని కాదు. నా యవ్వనం అడవిలో కాచిన వెన్నెల; యవ్వనం చల్లటిదనీ, హాయిని కలిగించేదని అనుకుంటే."

"లైంగిక సుఖాన్ని జయించగలిగావంటే నీవు అసామాన్యుడివి. ఏ స్త్రీ నిన్ను డబ్బులు తీసుకుని కూడా దగ్గిరికి ఎలాగూ రానిచ్చే అవకాశం లేదు కాబట్టి ఆ సుఖం పట్ల విముఖత ఏర్పరచుకుని ఉండొచ్చు."

"మరో పొగడ్త; మరో తెగడ్త. నన్ను నమ్మరా, అసలు ఎవరినీ నమ్మే గుణం లేదా?"

"నన్ను నేనే నమ్మను...లైంగిక సుఖం మీద నీకు ఇష్టం లేక పోవడానికి గల కారణం?"

"అవతలి వ్యక్తిని హిసించడం ఇష్టం లేక."

"అది ఆహ్వానించబడే హింస. ఆ  హింస ద్వారా అవతలి వ్యక్తికీ సుఖం లభిస్తుంది కదా."

"నా శరీరాన్ని చూస్తుంటే ఆ అనుభవ సుఖం సంగతి దేముడికి తెలుసు, అసహ్యం కలగడం మాత్రం నిక్కము."

"నిజమని ఒప్పుకుంటున్నావా; మనసులో వేరే అభిప్రాయం ఉందా," ఏదో సంతోషాన్ని అణగతొక్కుతూ అన్నాడు అనంతం.

అనంతం ఆనందాన్ని ఎందుకు పాడుచెయ్యాలి అని  అనిపించింది అతనికి.

"ఒక్కొక్కసారి నాకు సందేహం వస్తూ ఉంటుంది – ఎవరికీ ఎవరూ? అనుకోవాలా; ఒకరికి ఒకరం అనుకోవాలా అని."

"ఎంత కాదనుకున్నా ఒకరికి ఒకర; కొందరు దాన్ని బలవంతపు బ్రాహ్మణార్థముగా భావించవచ్చు. మనం ఒకరినొకరం పీక్కుతినే అవసరం జీవితంలో ఉంది కనుక."

"పీక్కు తినడానికి మరొకరు అవసరమో లేదో నాకు తెలియదు మీకు తెలిసినంతగా. మీరు నా లాంటి జుగుప్స కలిగించే రూపం గలిగిన వాడి పక్కన కూర్చుని, మీ తిరిగిరాని కాలాన్ని వెచ్చిస్తున్నారంటే మీరు మీ గురించే కాక

నాలాంటి అభాగ్యుల గురించి కూడా – వాళ్లకు ఎంగిలి చేతిని విదిలించ దలచుకోక పోయినా – మీరు కూడదనుకున్నా జీవించక తప్పదు. సమాజం ఒక  దారం లాంటిది, లేక తాడు లాంటిది మాలలా మనలను చేకూర్చి ఉంచిందేమో. ఆ పని ఎవరు లేక ఏ శక్తి చేసిందో మరి. దానికి దేముడు అని మనం పేరు పెట్టుకుందాం – మనం కనని బిడ్డకు మనం నామకరణం చేసినట్టు. దేముడు అన్న విషయం ఒక ఊబి. దిగబడితే బయిటికి అంత తేలికగా పైకి రాలేము; ప్రాణం పోకపోవచ్చుగాని. కేవలం ఒకరి మాటలను మరొకరు చెవులు అప్పగించి వినడానికి మాత్రమే మనలను ఏ శక్తీ కలిపి ఉంచలేదు. ఒకడు ఏడుస్తున్నపుడు మరొకడు స్వరం జతచెయ్యడానికి, ఓదార్చడానికి కూడా అది జరిగి ఉండొచ్చు; మిగతా విషయాలను పక్కనుంచి. ఇద్దరు మనుషులు ఒకరికొకరు తోడుండటం  ఆ ఇద్దరిలో ఒక్కొక్కసారి ఒక్కొక్కరికి శాపమేమో కూడా.”

"దానికి ఒక ఉదాహరణ చెప్పు."

"నా తోడు ఇప్పుడు మీకు శాపమేగా."

"ఇంతకూ ఈ సృష్టి, కనీసం మానవుడి సృష్టి ఎందుకట? అయినా అదంతా మాయేనేమో కదా?"

"ఇదంతా మాయో కాదో ఎలా తెలుస్తుంది? మాయ అనుకుంటే మాయలో ఉంటూ అలా అనుకోడమూ మాయే అవుతుంది – ఇలా అని నేనే కాదు అద్వైతులూ అంటారు. శంకరాచార్యే ఒక అద్భుతమైన శ్లోకాన్ని ఆ అనుమానాన్ని నివృత్తి చేసే ప్రయత్నంలో శ్రీ వివేకచూడామణిలో చెబుతాడు. దాని ప్రకారము: 'ప్రలయము లేదు; సృష్టి కూడా లేదు; దీనికి బద్ధుడైనవాడు లేడు; బ్రహ్మజ్ఞాన సాధకుడు, మోక్షేచ్ఛగలవాడు, ముక్తుడు లేరు – ఇదే పరమార్థం. సృష్టిగా భావించేది బ్రహ్మ క్రీడా; అలా అని అది క్రీడా కాదు. ఏదో ఉద్దేశంతో బ్రహ్మ సృష్టికి పూనుకో లేదు. బ్రహ్మె ప్రపంచం...' ఏ కోర్కెలూ లేక ఉద్దేశమూ లేని ధనవంతులు చేసే పనిలాంటిది (పిల్లితల గొరగటం) సృష్టి."

"ఆ వేదాంతం వినేకొలదీ నాకు మతి భ్రమించేలా ఉంది. గిల్లుకుని నొప్పిలేదు అనుకోవడం నీలా వేదాంతాన్ని ఆవదంలా ఒంటబట్టించుకున్న యోగికి సాధ్యం కానీ నాలాంటి వాడికి కాదు. ఈ లోకంలో ఉంటావో పోతావో నీ ఇష్టం. నేను వెళ్తున్నా," అనంతం లేవబోయాడు.

"సరిగ్గా ఒక గంట ఉండి వెళ్ళు, అన్నయ్య. ఇక్కడ సముద్రం గాలి సోకుతూ చనిపోదలుచుకున్నవాడికి కూడా ఒక గంట బ్రతకాలనిపించేట్లు ఉంది. మరికొంత సేపు నీ అందాన్నీఅవలోకించనీ; నీ పుల్లవిరుపుతనాన్ని వినోదించనీ."

అనంతం వాచీ చూసుకున్నాడు. వేరే చెయ్యాల్సిన పనేం లేదు. ఎక్కడో ఒక చోట తిండి వేళ దాకా షోదాగా తిరగడమే. ఈ వ్యక్తిలో ఏదో ఆకర్షణ ఉంది. మాట్లాడుతున్న విషయాలు అంతగా విసిగించడం లేదు. దబ్బులడిగే మనిషిలా లేడు. ఆత్మాభిమానిలా ఉన్నాడు; ఆకలితో చచ్చే రకమేగానీ 'మాదాకబళం, అమ్మ,' అని నోరు తెరిచి అడగని మొండివెధవలా ఉన్నాడు.

"నీవు చెప్పాల్సింది చెప్పడానికి గంట పడుతుందా లేక గంట సమయం గడవాలని అదీ ఇదీ చెపుతున్నావా?"

"నేను నాకు చెప్పుకో దలచినవి నీకు చెపుతున్నట్లు చెబుతున్నానని నేను, నీవు అనుకుందాం. గంట సమయం పట్టకపోవచ్చు కూడా."

"కక్కెయ్."

"ప్రకృతి లేక ప్రపంచం తనను తాను సృష్టించుకుని జీవకోటి సృష్టి, పరిణామానికి దోహదపడిందా? ప్రకృతితో పాటు జీవిని బ్రహ్మ సృష్టించాడని చెబుతాయి బ్రహ్మసూత్రాలు. ఎందుకంటే సృష్టి ఒక పద్ధతిని (design) అనుసరించి జరుగుతుంది కాబట్టి; పైగా సంకల్పం (will) కూడా సృష్టికి అవసరం. తెలివితేటలు లేని ప్రకృతికి సృష్టిని ఎప్పుడు ఆరంభించాలా, ఎలా దీన్ని కొనసాగించాలా, ఎప్పుడు సృష్టిని ఆపెయ్యాల అన్నవి అసాధ్యమైన పనులు. అద్వైతం బ్రహ్మో ఈ ప్రపంచం, దీని సృష్టి కర్త కూడా; ప్రపంచం బ్రహ్మలో కనిపిస్తుంది, అందులోనే ఉంటుంది; దానిలోకే లీనమైపోతుంది. ఆ పనులు బ్రహ్మ నిజానికి చెయ్యడు. సృష్టికి పూనుకోవాలంటే ఉద్దేశం ఉండాలి. అది ఆయనకు లేదు. కోరికలు అన్నీ నెరవేరిన రోజు ఏ పనికన్నా పూనుకుంటే దానికి వ్యక్తిగత ఉద్దేశం లేనట్లు భావించాలట. అలాంటి పని ఈ క్రీడ. ఈ క్రీడ కాని క్రీడను బ్రహ్మకు ఆపాదిస్తుంది అద్వైతం. బైబిల్ ఏమంటుందో కూడా ఒకసారి ముచ్చటించుకుందాం: 'ఆదియందు దేవుడు భూమిఆకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను, శూన్యముగను ఉండెను. చీకటి అగాధ జలము పైన కమ్మి యుండెను; దేవుని ఆత్మ జలముపై అల్లాడుచుండెను. దేవుడు వెలుగు కమ్మని పలుకుగా, వెలుగు కలిగెను. వెలుగు మంచి దయినట్లు దేవుడు చూసేను...' మనల్ని నేటికీ, ఎప్పటికీ వేధించే ప్రశ్నలు షుమారు మూడువేల సంవత్సరాలనాటి రుగ్వేదంలోనూ చోటు చేసుకున్నాయంటే ఆశ్చర్యం కలిగించే అంశమే. నాసదీయ సూక్తం ప్రసిద్ధమైనది కదా... 'అప్పుడు అస్తిత్వం లేదు, అస్తిత్వరాహిత్యమూ లేదు. గాలి లేదు, ఆకాశమూ లేదు. మృత్యువు లేదు, అమరత్వం లేదు. రాత్రి పగళ్ళను వేరు వేరుగా చూసే వీలు లేదు. ఆదిపురుషుడు ఉచ్ఛ్వాసనిశ్వాసాలను ఊపిరి లేకుండా గావించాడు. చీకటిని చీకటి మరుగు పరచింది. అంతా రూపరహితమైన జలం. శూన్యం కప్పి ఉంచిన అతను వేడికి గల శక్తి ద్వారా ఆవిర్భవించాడు మొదట. పురాతన మానసిక బీజం అనగా కోర్కె నాట బడింది. విత్తనాలు వదల బడినాయి. బలమైన శక్తులు ఆవిష్కరింపబడినాయి. దిగువున పురికొల్పు, పైన సంకల్పం జరిగాయి.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS